ఎడతెగని వాన..

- పొంగిపొర్లుతున్న చెరువులు, వాగులు, వంకలు
- దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు.. స్తంభించిన రాకపోకలు
- రుద్రారం-నాగసముందర్ వాగును పరిశీలించిన అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర

రుద్రారం- నాగసముందర్ వాగు వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

ధారూరు, సెప్టెంబర్ 1: ధారూరు మండల పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాల్లో వాగులు, కుంటల్లో భారీగా నీరు చేరుకున్నది. పొలాలు నీటితో నిండిపోయాయి. మండలంలోని నాగారం-మైలారం వాగు వంతెనపై నుంచి, అదేవిధంగా రుద్రారం-నాగసముందర్ మధ్య కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు వంత్తెనపై నుంచి వరద పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

దోర్నాల్-ధారూరుస్టేషన్ గ్రామాల మధ్య వాగు, చింతకుంట గ్రామ సమీపంలోని వాగు వంత్తెనపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. రుద్రారం-నాగసముందర్ మధ్య కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగును వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, ధారూరు, కోట్‌పల్లి తహసీల్దార్లు షాజిదాబేగం, శ్రీనివాస్, ఎంపీడీవోలు నర్సింహులు, దానియాల్, ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్, ఎంపీవో షఫీఉల్లాఖాన్, తదితరులు పరిశీలించారు.

దోర్నాల్-ధారూరు స్టేషన్ మధ్య ఉన్న(కాగ్నవది) వాగును ధారూరు ఎంపీడీవో నర్సింహులు, ఎస్ఐ, ఎంపీవో తదితరులు పరిశీలించి, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. వరదనీటి ప్రవాహం తగ్గేవరకు ఎవరినీ వాగు దాటవద్దని హెచ్చరించారు.

నాగారం-మైలారం గ్రామాల మధ్య వంతెనపై పొంగిపొర్లుతున్న వర్షపు నీరు

ధారూరుస్టేషన్- దోర్నాల్ గ్రామాల మధ్య పొంగిపొర్లుతున్న కాగ్నావాగు

రుద్రారం- నాగసముందర్ గ్రామాల మధ్య వరద ఉధృతిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తదితరులు

నాగసముందర్ వాగు వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ షాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు

గౌడ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

- శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

గౌడ సంఘం కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామిగౌడ్

మొయినాబాద్, సెప్టెంబర్ 1: గౌడ కులస్తుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఆదివారం గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు రేనెట్ల మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నియమించారు. చిలుకూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి నర్సింహగౌడ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించగా, జిల్లా ఉపాధ్యాయుడిగా సురంగల్ గ్రామానికి చెందిన ఎల్లని అశోక్‌గౌడ్‌ను నియమించారు. మండల కమిటీ అధ్యక్షుడిగా బస్వాపురం అంజయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణగౌడ్, మహేశ్‌గౌడ్, భిక్షపతిగౌడ్‌లను ఎన్నుకున్నారు. యువత కమిటీ మండల అధ్యక్షుడిగా చేగూరి విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా బస్వాపురం యాదయ్యగౌడ్, దేవేందర్‌గౌడ్, వెంకటేస్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వామిగౌడ్ హాజరై ప్రసంగించారు. ప్రభుత్వాలు గౌడ కులవృత్తి కొనసాగే విధంగా ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో గౌడ సంఘం జాతీయ నాయకులు రామకృష్ణగౌడ్, కృష్ణాగౌడ్, నాయకులు భిక్షపతిగౌడ్, సత్యనారాయణగౌడ్, నవీన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయండి

- భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎస్పీ నారాయణరెడ్డి సూచన

వికారాబాద్, సెప్టెంబర్ 1: జిల్లాలో భారీ వర్షాల కారణంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 100కు డయల్ చేయాలని లేదా? పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670056 నంబర్‌లో సంప్రదించాలని ఎస్పీ కే. నారాయణరెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించి జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వరద నీటి ప్రవాహానికి సంబంధించిన విషయాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు తమ స్టేషన్ల పరిధిలో వాగులు, కుంటలు, చెరువుల్లో వరద నీటి ప్రవాహంపైన దృష్టి పెట్టాలన్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున వాగులు, చెవుల వద్ద బందోబస్తు నిర్వహించాలని సూచించారు. పొంగిపొర్లుతున్న వాగులు, నాళాలు, వంతెనల వద్ద రోడ్లను బ్లాక్ చేయాలని ఆదేశించారు. గ్రామాల పెద్దలతో కలిసి పని చేయాలని సూచించారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు రెయిన్ కోట్‌లను వినియోగించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలెవ్వరూ వాగులు, కాలువలను, రోడ్లను దాటకుండా చూడాలన్నారు. పాత ఇండ్లలో ఎవరూ ఉండవద్దని ప్రజలను హెచ్చరించారు.

భారీ వర్షాల నేపథ్యంలో నేడు విద్యా సంస్థలకు సెలవు

రంగారెడ్డి, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ), వికారాబాద్ : రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వాతావరణశాఖ ప్రమాద హెచ్చరికల నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఎవరైనా పాఠశాలలు తెరిచినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. వర్షాలకు బయటకు వెళ్లకుండా ఇండ్లల్లోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

బిగ్‌టీవీ రిపోర్టర్ ఫయాజ్‌కు రిమాండ్

- గతంలో పలు చానళ్లలో అవినీతి ఆరోపణలతో తొలగింపు
- బిగ్‌టీవీతోపాటు, సొంత యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసి బెదిరింపులు, వసూళ్లు
- ఫయాజ్, అతడి అనుచరులను అరెస్ట్ చేసిన కొత్తూరు పోలీసులు

కొత్తూరు, సెప్టెంబర్ 1 : బిగ్‌టీవీ రిపోర్టర్ మునవర్ ఫయాజ్‌ను కొత్తూరు పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. కొత్తూరు సీఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన ఫయాజ్ మునావర్ గతంలో పలు చానళ్లలో పని చేశాడు. తాను రిపోర్టర్‌ను అని చెప్పి జేపీ దర్గాలో కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్, వ్యాపారులు, పలు కంపెనీలు, పాఠశాలల యాజమాన్యాల వద్దకు వెళ్లి నెలవారీ వసూళ్లకు పాల్పడేవాడు. అతడి అవినీతిపై ఆయా చానళ్ల యాజమాన్యాలకు ఫిర్యాదులు అందడంతో అతడిని విధుల నుంచి తొలగించాయి. ఆ తర్వాత బిగ్ టీవీతో పాటు, సొంతంగా యూ ట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేసుకొని ఇన్మన్నర్వ గ్రామానికి చెందిన మీర్జా షౌకత్, సదాక్ అలియాస్ ఎంపీ సాధిక్, ఎండీ జమీల్ అన్సారీ, ఎండీ అఖిల్ అన్సారీ మరికొంతమందితో కలిసి బృందాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. వారితో దౌర్జన్యాలకు పాల్పడుతూ వసూళ్లు కొనసాగిస్తున్నాడు. జేపీ దర్గా సబ్ కాంట్రాక్టర్లు హబీబ్, సయ్యద్ రఫీక్, నవాజ్, సయ్యద్ మహమూద్, సయ్యద్ అజ్మత్, అజ్మత్ వద్ద నుంచి ప్రతినెలా రూ.10వేలు, రూ. 20 వేలు వసూలు చేశాడు. అనంతరం ఏక మొత్తంలో రూ. 5 లక్షలు డిమాండ్ చేయడంతో సబ్ కాంట్రాక్టర్లు ఒప్పుకోలేదు. ఆగస్టు 30న వారిని కట్టెలు, చెక్కలు, బజ్జీలు చేసే గరిటెలతో కొట్టి గాయపరిచారు. దీంతో రఫీక్ కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ నరసింహారావు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆగస్టు 31 సాయంత్రం నిందితులు తిమ్మాపూర్ బస్టాప్‌లో తారసపడ్డారు. ఫయాజ్, అతడి తండ్రి ఎండీ సయ్యద్,జమీల్ అన్సారీ, అఖిల్ అన్సారీలను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ఫయాజ్, అతడి అనుచరులను రిమాండ్‌కు తరలిస్తున్న కొత్తూరు పోలీసులు

సీఎం ఇలాకాలో కరెంటు కోతలు

కొడంగల్, సెప్టెంబర్ 1: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొడంగల్ ప్రజలు కరెంటు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజులుగా కనీసం రెండు గంటలు కూడా కరెంటు సరఫరా కావడంలేదని పలువురు పేర్కొంటున్నారు. వర్షాల సమయంలో కాకుండా మామూలు పరిస్థితుల్లోనూ సీఎం ఇలాకాలో కరెంటు ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. రెండు రోజులుగా కరెంటు కోతలతో టిఫిన్ సెంటర్‌లు, హోటల్స్, తదితర వ్యాపారులు కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరెంటు కోతలు ఉండేవి కావని, ప్రస్తుతం చినుకుపాటి వర్షానికే కరెంటు సరఫరా నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం జిల్లాకు హైడ్రా వచ్చేనా..?

- స్పీకర్ నియోజకవర్గంలోనే ఉన్నతాధికారులు, అధికార పార్టీ నాయకుల కబ్జాలు!
- నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోరా?
- టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేందర్‌గౌడ్

వికారాబాద్, సెప్టెంబర్ 1 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా వికారాబాద్‌లో కబ్జాలను కూల్చేందుకు హైడ్రా వచ్చేనా? అని టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జి.నాగేందర్‌గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం వికారాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పెద్ద 'హైడ్రా'మా నడుపుతున్నారని అన్నారు. హైడ్రాలో విధి, విధానాలు సక్రమంగా, నిష్పక్షపాతంగా, రాజకీయలకు అతీతంగా ఉండాలనేది తమ పార్టీ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. నోటీసులు ఇవ్వకుండా బడా నాయకుల భవనాలు కూల్చివేస్తే సంతోషమే కాని, పలు స్థలాల్లో చిరుద్యోగులు, బ్యాంకుల్లో లోన్లు తీసుకొని ఇండ్లు కట్టుకున్న వారి ఇండ్లు కూల్చివేయడం ఎంతవరకు సమంజసమన్నారు. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, 111జీవో నిబంధనలు అతిక్రమించి ప్లాట్లు చేసిని వారిపై, అనుమతులు ఇచ్చిన అధికారులపై, సహకరించిన రాజకీయ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలపాల న్నారు. ఇండ్లు కోల్పోయిన పేదలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పునరావాసం కల్పించేందుకు పేదల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు.

నగరంలో నోటీసులు ఇవ్వకుండా 160 కట్టడాలను కూల్చివేశారని, అయితే గత సీఎం వైఎస్ఆర్ హయాంలో రామోజీ ఫిల్మ్ సిటీలో సర్వే చేసి.. ప్రభుత్వ స్థలం 12 ఎకరాల గుర్తించి అప్పటి తహసీల్దార్ ఫెన్సింగ్ వేశారని, ఆ భూమిని ఎలా కాపాడుతారో తెలుపాలన్నారు. హైదరాబాద్‌లో గతంలో 3వేల చెరువులు ఉంటే, 2,500 కాంగ్రెస్ హయాంలోనే మాయమయ్యాయని ఆయన ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లాకు గత 9 నెలల్లో ఎలాంటి నిధులు కేటాయించలేదని మండిపడ్డారు.

ఓ ఐఏఎస్ అధికారి వికారాబాద్‌లోని శివసాగర్ చెరువులో ఎఫ్‌టీఎల్ జోన్‌లో 12 ఎకరాలు కబ్జా చేసి అందులో ఇల్లు కట్టి రోడ్లు వేసినట్లు ఆయన ఆరోపించారు. అధికారి ఉండటంతో ఆ ఇంటి పక్కనే ప్లాటింగ్‌లు వెలిశాయని తెలిపారు. ఓ కలెక్టర్ కూడా ఇందులో కబ్జా చేశారని ఆరోపించారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టులో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ నియోజకవర్గంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తారా? లేదా? చెప్పాలన్నారు. చెరువులు కబ్జా చేసిన వారిపై, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకునే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.

శంకర్‌పల్లిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని ఎంపీకి వినతి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 1 : శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌లో బీజాపూర్-వాడి ప్యాసింజర్, హుబ్లీ -సికింద్రాబాద్, ఎల్‌టీటీ రైళ్లు నిలపాలని కోరుతూ ఆదివారం బీజేపీ నాయకులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంకర్‌పల్లి స్టేషన్‌లో ఆయా రైళ్లు ఆపకపోవడంతో విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్పందించిన ఎంపీ రైల్వే జీఎంతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపాలిటీ ఇన్‌చార్జి వాసుదేవ్, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, నర్సింహులు, బయన్న ఉన్నారు.

లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేశాం..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ): వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్లు, సీసీపీ శ్రీనివాస్‌తో ఆదివారం మేయర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు సర్‌ప్లస్ అవుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, కాంపౌండ్ వాల్‌ను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కన్‌స్ట్రక్షన్ సైట్లతో తాత్కాలికంగా పనులు ఆపాలని, లేబర్‌ను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాలాలు, స్మార్ట్ వాటర్ డ్రైన్ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తూ పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలను తరలించాలని మేయర్ అధికారులకు చెప్పారు. వర్షాల నేపథ్యంలో ఆపద సమయంలో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్. ఫోన్ నంబర్ 040-2111 1111కు గానీ, మై జీహెచ్ఎంసీ యాప్‌కు ఆన్‌లైన్ ద్వారా డీఆర్ఎఫ్ (హైడ్రా) ఫోన్ నంబర్ 9000113667లో గాని సంప్రదించాలని మేయర్ కోరారు. గ్రేటర్‌లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ గేట్ల వద్ద జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, లేక్స్ ఈఈ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రైతు రాయల స్వర్ణ చరితం

జ్యోతి ప్రజ్వలన చేసి రైతు రాయల స్వర్ణ చరితం నృత్య రూపకాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఏబీకే ప్రసాద్

రవీంద్రభారతి, సెప్టెంబర్ 1: భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్స్ ఆర్ట్స్, తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు రాయల స్వర్ణ చరితం శ్రీకృష్ణదేవరాయల చారిత్రాత్మక నృత్యరూపక ప్రదర్శన ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాశాఖ, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశం, సీనియర్ పాత్రికేయుడు ఏబీకే ప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, పురావస్తు శాఖ సీఈఓ డాక్టర్ ఈమణి శివనాగిరెడ్డి, కృష్ణదేవరాయ తదితరులు విచ్చేసి రైతు రాయల స్వర్ణ చరిత్రం శాస్త్రీయ నృత్య ప్రదర్శను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. శ్రీకృష్ణదేవరాయుల పాలనలో కవు లు, కళాకారులను పోషించడం వల్ల ఆయన యుగానికి స్వర్ణయుగంగా పేరు వచ్చిందన్నారు. భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు ఎంఎస్ కోకా విజయలక్ష్మి ఆధ్వర్యంలో చేసిన రైతు రాయల స్వర్ణ చరితం నృత్య రూపకం వీక్షకులను ఆకట్టుకున్నది. కార్యక్రమంలో భాగవతుల సేతురామ్, గోవింద నాగరత్నం నాయుడు, మునిరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి

- సీపీఎస్‌పై వివిధ ఉద్యోగ సంఘాల నాయకుల నిరసన

సీపీఎస్ విమోచన దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు

రంగారెడ్డి, సెప్టెంబరు 1(నమస్తే తెలంగాణ) : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని ఉద్యోగుల జేఏసీ రంగారెడ్డి జిల్లా చైర్మన్ కె.లక్ష్మణ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ కె.రామారావు డిమాండ్ చేశారు. కేంద్ర జేఏసీ పిలుపు మేరకు ఆదివారం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహించారు. గత ఇరవై ఏళ్లుగా ఉద్యోగులు సీపీఎస్ రద్దు కోసం నిరసనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నాలో జేఏసీ నాయకులు శ్రీనేశ్‌కుమార్, బుచ్చిరెడ్డి, గోవర్ధన్‌యాదవ్, కె.గోపాల్, ప్రతాప్, సుధాకర్, వెంకటేశ్, అనిత, రేవతి, వెంకట్, లక్ష్మణస్వామి, సుజాత, డాక్టర్ నరేందర్, శ్రీకాంత్ గౌడ్, ఇస్మాయిల్, గోపాల్, మహేందర్‌రెడ్డి, మునీర్ పాషా, బుచ్చిబాబు, వెంకటస్వామి, టీజీవో, టీఎన్జీవో, నాలుగో తరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

వికారాబాద్ : ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని టీజీఈ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.శివకుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లాలో టీజీఈ జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సీపీఎస్ విమోచన దినోత్సవం సందర్భంగా వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.శివకుమార్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానంతో మరణించిన ఉద్యోగుల కుటుంబానికి రెండు వేలు పెన్షన్ కూడా రావట్లేదని, దాంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను కేంద్రం వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి అజ్మత్ పాషా, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు రమేశ్, హీరాలాల్, హాజి, రత్నం, పీఆర్‌టీయూ అధ్యక్షుడు చంద్రశేఖర్, బాలకృష్ణ, మధుకర్‌తో పాటు వివిధ ఉద్యో, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వానకాలం.. జరపైలం!

- జోరువానల వేళ కరెంట్‌తో భద్రం
- విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు

యాచారం, సెప్టెంబర్ 1: అసలే వర్షాకాలం.. ఆపై రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు. జోరువానల్లో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. భారీగా కురుస్తున్న వర్షాలతో అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు సంబంధిత అధికా రులు. వర్షాలకు ఇల్లు, వాకిలి, పొలం తడిగా ఉంటుందని, ఆ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాలు, సపోర్టు తీగలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఎర్తింగ్ తీగలు, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్ల పొదల్లో తీగలు, పొలాల్లో తీగలు తెగిపడటం, చెట్ల కొమ్మలకు తీగలు తగలడం, జనావాసాల మధ్య ఉన్న విద్యుత్ బుడ్డీలతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు. ఈదురుగాలుల సమయంలో సాధారణ ప్రజలు, రైతులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలు కొద్ది పాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చని విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ పేర్కొంటు న్నారు. ఆయన సలహాలు సూచనలు..

ప్రమాదాలు ఇలా..

వర్షాకాలంలో ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపోవడం, తీగలు అల్లుకొని మంటలురావడం, స్తంభాలు విరిగిపోవడం, ఇళ్ల ముందు ఇనుప స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, ఒరిగిపోయిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద శబ్దాలు, మంటలు రావడంతో ప్రజలు, రైతులు, మూగజీవాలు విద్యుత్ ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయి. ఇళ్లలో ఎర్తింగ్‌తో షాక్ వచ్చే ప్రమాదం ఉంటుంది. పొలాల వద్ద ఫ్యూజ్‌లు మార్చేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- తడిసిన విద్యుత్ స్తంభాలను, సపోర్టు తీగలను ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోరాదు.
- తడి చేతులతో స్టాటర్లు, మోటర్లు, విద్యుత్ స్విచ్ బోర్డులు వేయరాదు.
- పొలాల వద్ద స్టార్టర్లకు తలుపులు, మోటర్లకు కవర్లు ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంట్లో అతుకుల విద్యుత్ తీగలు ఉంటే ఎలక్ట్రిషన్‌ను సంప్రదించి వెంటనే తగిన మరమ్మతులు చేయించుకోవాలి.
- రహదారుల వెంట, ఇళ్ల ముందున్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ సపోర్టు తీగలు ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోరాదు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడిన ఆవు(ఫైల్)

- జీఏ వైర్‌కు ప్లాస్టిక్ తొడుగులు ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్ సర్వీస్ వైర్‌ను నేరుగా ఇంటి పైకప్పుకు కట్టకూడదు, గోడకు మేకు కొట్టి దానికి చుట్టుకోవాలి. రేకుల షెడ్డుకు విద్యుత్ తీగలు తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విద్యుత్ తీగలు తగులుతున్న చెట్లను, తడిగా ఉన్న గోడలను తాకరాదు.
- పిల్లలకు అందనంత ఎత్తులో ప్లగ్‌లను ఏర్పాటు చేయాలి. ఇంటి వైరింగ్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి.
- రోడ్ల మీద విద్యుత్ తీగ తెగిపడితే దానిని తాకవద్దు, వాటి మీదుగా వాహనాలు నడపకూడదు. వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.
- ఎవరైనా విద్యుత్ ప్రమాదానికి గురైతే రక్షించడానికి పొడిగా ఉన్న కర్ర, ప్లాస్టిక్ వస్తువులను మాత్రమే ఉపయోగించాలి.
- వ్యవసాయ పంపుసెట్లకు, స్టార్టర్లకు విధిగా ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి.
- చెట్ల కొమ్మలు, భవనాలపై తెగిపడిన తీగలు ఉంటే అప్రమత్తంగా ఉండాలి.
- ఫ్యూజులు మార్చడం, మరమ్మతులు ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు.
- చిన్న పిల్లలను విద్యుత్ పరికరాలకు వీలైనంత దూరంగా ఉంచాలి.
- ఉతికిన తడి బట్టలను ఇనుప తీగలపై వేయకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడినపుడు టీవీ డిష్ కనెక్షన్ తొలగించాలి.
- వర్షం పడుతున్న సమయంలో టీవీ, ఫ్రిడ్జ్, వాటర్ మోటర్, కంప్యూటర్ స్విచ్‌లను వెంటనే బంద్ చేయాలి, లేదంటే వైర్లు షాట్ సర్క్యూట్‌కు గురయ్యే అవకాశాలులన్నాయి.
- కరెంట్ లైన్ కింద స్మార్టు ఫోన్‌లు ఉపయోగించకూడదు.
- విద్యుత్ ప్రమాదం సంభవిస్తే విద్యుత్ బిల్లులో ఉండే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి. ఇందుకోసం యూఎస్‌సీ నంబర్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి.